

# చిల్లుపడిన జీవితనౌక

బూట్లు టకటక లాడించుకొంటూ వచ్చిన కానిస్టేబుల్ ఫోర్ నాట్ టూ కటకటాల వెనుక సర్వసంగ పరిత్యాగిలా కూర్చున్న ఖైదీని చూసి భారంగా నిట్టూర్చాడు.

తెల్లగా నెరసిన గెడ్డం, వెండిరంగులో మాసిన జుట్టు, జీవకళ లోపించిన కళ్ళు. ఇప్పుడెలా వున్నా ఒకానొకప్పుడు స్ఫురద్రూపి అని చెపుతున్న మదురు. అతని ఆర్థిక పరిస్థితిని తెలియజేస్తున్నచొక్కా. రణాగ్నికి బలైన క్షతగాత్రులను చూసి పశ్చాత్తాపంతో వైరాగ్యం పొందిన భీష్మాచార్యుడు నిర్వీర్యుడై, అలసట చెందిన ముఖంతో వచ్చి కటకటాల వెనుక కూర్చున్నాడా అన్నట్టు భ్రాంతి చెందాడు ఫోర్‌నాట్‌టూ ఒక్కక్షణం పాటు.

"ఏమైనా కావాలా మాష్టారూ" అని అడగాలనుకొని ఆగిపోయాడు. ఆత్మీయులు బెయిలుపై తీసుకుపోతామన్నా వద్దన్నాడంటే ఆయన దేన్ని కోరుకుంటున్నాడో అర్థం చేసుకోగలడు తను. నిర్లిప్తత అన్నిటికంటే గొప్ప స్థితి. అనిర్వచనీయమైంది. దాన్ని ఛేదించడం మంచిది కాదనిపించింది.

తపోభంగమైన రుషిలా తలపైకెత్తి, తనచుట్టూ వున్న పరిసరాలను పరిశీలించాడు దోషి, ఆ 'సెల్'లో కొత్తగా లాకప్‌లో వేయబడ్డ బందీలు తననే విచిత్రంగా చూస్తున్నారు. తనతోబాటే ఇదే 'లాకప్'లో వేయబడ్డ విప్లవనాయకుడు రాజేష్ తన గతాన్ని తెలుసుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. అయినా తనింకా ఏదో చెపుతానని ఆశ పడుతూనే ఉన్నాడు.

నిర్లిప్తతతో కూడిన కళ్ళతో పైకప్పు కేసి చూస్తూ తల గోడకానించేడు ఆ దోషి. భూతకాలం భూతంలా మారి కళ్ళముందు కనిపిస్తోంది. ఆ రోజు అలా జరిగి ఉండకపోతే ఈ రోజు ఇలా జరిగేది కాదు అనిపిస్తుంది. కానీ విధి బలీయమైంది. దాన్ని ఎవ్వరూ ఆపలేరు, అనుకొంటూ గత స్మృతులలోనికి వెళ్ళిపోయేడు 'రామారావు మాష్టారు' అనబడే ఆ వింత ఖైదీ.

* * *

అధికారులు అందజేసిన రిటైర్‌మెంట్ ఆర్డర్ వణుకుతున్న చేతులతో అందుకొని, చదవకుండానే జేబులో పెట్టుకొని టేంక్‌బండ్ ఒడ్డుకుచేరి, కాస్త మనసు నిలకడపడ్డాక తీసి చదివేడు. చదివిన తరువాత ఎంతసేపు ఆ స్థితిలో వున్నాడో తెలియదుకానీ, ఏ వింత జరిగినా, ఏ విడ్డూరం జరక్కపోయినా, చరిత్ర పుటల్లో ఈరోజుకు విలువ అన్నది వున్నా లేకపోయినా, సూర్యాస్తమయం మాత్రం రోజూ జరిగినట్టే ఈరోజూ కన్నుల పండుగగా జరిగిపోతోంది అని మాత్రం అనుకున్నాడు. హఠాత్ రిటైర్‌మెంట్ వార్తవినగానే గుండె ఆగి మరణించిన బావ జగన్నాథం తనకంటే అదృష్టవంతుడనిపించింది ఆ క్షణం. జనతా బండిలావున్న ఆ సంసారాన్ని పాత స్టీమ్ ఇంజన్‌లా లాక్కువస్తున్న ఆ మహానుభావుడికి యాభైఐదు నిండిన ఈ వయసులో ఈ హఠాత్ రిటైర్‌మెంట్ పిడుగుపాటే మరి! జీవించడానికి బదులు, జీవించడాన్ని గురించి ఆలోచించే వాళ్ళు దెబ్బతినేదిఇటువంటిపరిస్థితులలోనే.మార్పును కోరిన వాళ్ళందరూ అభిమానించి నిలబెట్టిన ప్రభుత్వమే ఇది. అయినా ఒక్కో ప్రభుత్వం ఒక్కో విధంగా ఆలోచిస్తుంది. అది తీసుకొనే నిర్ణయాలకు కొందరికి ఇబ్బందులు కలిగితే, మరి కొందరికి లాభించింది. అలాగని నిర్ణయాలు ఆగవుగా! జగన్నాథం బావ బావమరిదికి ఎల్.డి.సి. నుండి యు.డి.సి.గా ప్రమోషన్ వచ్చిందట. అతడో చెంప సంతోషిస్తున్నాడు. అయినా ముందుగానే హెచ్చరించి వుంటే ఇలా జరిగేది కాదేమో. బావ మరణం ముందు రిటైర్‌మెంట్ బాధనిపించడం లేదు. అయినా భవిష్యత్ ఏం కానున్నదో తెలియదు.

కటకటాల వెనుక చప్పుడయ్యేసరికి ఆలోచనా ప్రపంచానికి అంతరాయం కలిగి తలదించి చూసేరు రామారావు మాష్టారు. ఫోర్ నాట్ టూ నిలబడి వున్నాడు.

"మంచినీళ్ళేమైనా కావాలా సార్?" అని అడిగేడు.

కావాలన్నట్టు తల వూపేరు మాష్టారు. విప్లవకారుడ్ని కూడా అడిగేడు. వద్దని చెప్పేడు విప్లవకారుడు. ఫోర్‌నాట్‌టూ వెళ్ళిపోయాడు. పోలీసులకు నరలోకం యములని పేరు పెట్టింది ఎవరో కాని, వాళ్ళలో కూడా మానవత్వం మూర్తీభవించిన, మంచి వాళ్ళు వుంటారనడానికి ప్రత్యక్షసాక్షి ఈఫోర్‌నాట్‌టూ అనుకున్నారు మాష్టారు.

లాకప్‌లోని విప్లవకారుడు చేతిగోళ్ళతో తెల్లగోడలపై విప్లవ నినాదాన్ని చెక్కుతున్నాడు.

"ఈ సృష్టినంతటినీ త్రుటిలో భస్మం చేయగల మారణాయుధాన్ని నిరుద్యోగ పట్టభద్రులే కనిపెడతారట" అదే అతని భావం.

ఫోర్‌నాట్‌టూ మంచినీళ్ళు అందిస్తూ చెప్పేడు.

"మీ కోసం ఖాసిం అని ఎవరో వచ్చేరు. పంపించమంటారా మాష్టారూ" అన్నాడు వినయంగా.

ఫోర్‌నాట్‌టూకి నలభైఐదు ఏళ్ళుంటాయి. చెంపలు ఇప్పుడిప్పుడే నెరుస్తున్నాయి. పేరు పెంటయ్య. పేరులో ఏముంది. మనిషిలో దేముడున్నాడనిపిస్తుంది. అయితే దేముడు దయార్ద్ర హృదయుడా? తెలియదు కానీ, పెంటయ్య మాత్రం ఎదుటివారి మనస్సును నొప్పించ కూడదనుకొనే ఉత్తమ మనుష్యుడు. ఈ ఉద్యోగానికి ఎందుకు వచ్చేడో?.

"పంపించు బాబూ" అన్నారు మాష్టారు.

ఖాసిం ముఖం దైన్యంగా వుంది. బెంగ పడిన వాడిలా వున్నాడు. వచ్చీ రావడంతోనే మాష్టారి రెండు చేతులూ పట్టుకొని "మహాపాపం చేశాను సాబ్" అంటూ బొట బొటా కన్నీళ్ళు కార్చేడు. మాష్టారు నెమ్మదిగా ఓదార్చేరు.

"లేదు ఖాసిం. నువ్వు చెప్పింది ఏదైనా వుంటే అది నాకే చెందుతుంది. ఇష్టంలేక పోయినా నేను అడిగిన వరాన్ని ప్రసాదించిన దేముడివి నువ్వు, అంతే!" అన్నారు మాష్టారు.

"లేదు సాబ్. జరిగింది చెప్పి శిక్ష ఇద్దరం అనుభవించితే గాని అల్లా నన్ను కరుణించదు సాబ్. కాబట్టి జరిగింది చెప్తాను సాబ్" అన్నాడు ఖాసిం వణికే కంఠంతో నెమ్మదిగా.

"లేదు ఖాసిం. నీకూ నాకూ ముడి పెట్టబడి ఇంకా చాలా మంది వున్నారు. వాళ్ళంతా అల్లరి పడతారు. విషయం పేపర్ల కెక్కితే అలజడవుతుంది. వద్దు ఖాసిం, నిదానంగా ఆలోచించు" అన్నారు మాష్టారు.

ఖాసింను ఒప్పించి పంపేసరికి చాలా కష్టమయింది. ఇప్పుడైనా జరిగిందేమిటో చెప్పమన్నట్టు చూశాడు నిరుద్యోగ విప్లవకారుడు.

నిస్త్రాణతో రామారావు మాష్టారు మళ్ళీ తన ఆలోచనా ప్రపంచంలోనికి వెళ్ళిపోయారు. ఖాసింతో తన పరిచయం చాలా విచిత్రంగా జరిగింది. తన జీవితంలోని ఆఖరు దశలో చాలా విచిత్రంగా కలిసిన వ్యక్తి ఖాసిం.

రిటైర్ అయిన వెంటనే చంద్రం వేయించిన ట్రావెలింగ్ ఏజన్సీలోచేరిన తనకి,తరచూ ట్రావెలింగ్ కంపెనీకి వచ్చి స్మగుల్డు గూడ్సు అమ్మే ఖాసింతో పరిచయం కలిగింది. అందరినీనవ్విస్తూ, తనునవ్వుతూ

— ఆరట్ల శివప్రసాద్



తెలుగులో స్వచ్ఛంగా మాట్లాడే ఖాసిం తను ఒంటరిగా వుంటే వచ్చి కూర్చొని కష్టసుఖాలు ముచ్చటించే వాడు. వీలున్నప్పుడల్లా ప్రభుత్వాలన్నింటినీ తిట్టేవాడు. ఏ ప్రభుత్వం వచ్చినా తనకు నష్టం లేదనే వాడు.

"వీకీ స్మగుల్డు గూడ్సు ఎక్కడి నుండి వస్తున్నా యవి" అడిగితే అప్పుడు చెప్పేడు. తనకు ఏ స్మగ్లింగ్ ముఠాలతోనూ సంబంధం లేదనీ, అరబ్ దేశాల నుండి వచ్చే షేక్‌లు తమ దేశాలకు తిరిగి వెళ్ళేముందు ఇవి తనకు కానుకగా ఇచ్చి వెళ్ళి పోతారని చెప్పేడు. ఇంత విలువయిన వస్తువుల్ని కానుకగా ఎలా ఇస్తారని ఆశ్చ ర్యంగా అడిగితే, ఫక్కున నవ్వేడు. వాళ్ళకు ఇష్టం కావాలి కాని తాజ్‌మహల్‌నుకొని ఇచ్చేస్తారని అన్నాడు.

"ఇంతకీ వాళ్ళకు నువ్వు చేసి పెట్టే పనేమిటి" అని అడిగితే, వాళ్ళు వచ్చిన దగ్గర నుండీ పోయేవరకూ కంటిలో నలుసులా మెలగాలి. వాళ్ళడిగిందల్లా చేయాల, మంచి అమ్మాయిల్ని తీసుకురమ్మంటే తేవాల, వద్దంటే తీసుకు పోవాల అన్నాడు. కొంత అర్థమైంది. ఒక్కొక్కరి జీవితానికి మార్గం ఒక్కొక్కలా ఎన్ను కుంటారు, తన కెందుకని ఊరుకున్నాడు.

ఒకరోజు ఒంటరిగా వున్నసమయంలో నీరసంగా వచ్చి కూర్చున్నాడు ఖాసిం. అతని ముఖం విచారం గానూ, కోపంగానూ కనబడుతోంది.

"ఏమిటి ఖాసిం, విశేషాలేమిటి" అన్నారు మాష్టారు నవ్వుతూ....

"ఈ అరబ్‌లు పట్టి బద్మాష్‌లు ఫాబ్" అన్నాడు ఖాసిం, కసిగా.

"ఏమిటి విషయం" అన్నారు మాష్టారు విస్మ యంగా.

"కొత్తగా వచ్చిన అరబ్‌గేంగ్ ఒక విచిత్రమైన కోరిక కోరారు సాబ్. అందులో కొత్తదనం ఏమీలేదు. బొంబాయిలో తరచూ జరిగేదే. కానీ హైదరాబాద్‌లో ఇలాంటిది జరగనూ లేదు, ఎవరూ కోరనూ లేదు సాబ్" అన్నాడు ఖాసిం.

"ఏమిటా కోరిక" అన్నారు మాష్టారు ఆసక్తిగా.

"వాళ్ళకి ఏక్సిడెంట్ అన్నది ఎలా జరుగుతుందో చూడాలని వుందట" అన్నాడు ఖాసిం.

"అందుకని" అన్నారు మాష్టారు విస్మయంగా చూస్తూ.

"ఏమీ లేదు సాబ్. మంచి ట్రాఫిక్ వున్న రోడ్డుపై ఒక మనిషిని అడ్డంగా పరుగెత్తించాలి. అప్పుడు కనుక ఏక్సిడెంట్ జరిగితే, వాళ్ళు చూసి ఆనందిస్తారు. ఏక్సిడెంట్ అన్నది జరిగినా జరక్క పోయినా అలా చేసిన వాడికి పాతికవేలు బహుమానం ఇస్తారు. ఏక్సిడెంట్‌లో కాలో, చెయ్యో విరిగితే మరో పదివేలు, మొత్తానికి మనిషే లేకుండా పోతే వారి ఆనం దానికి అంతే లేదు సాబ్. లక్షలు కురిపిస్తారు. కానీ అంత సాహసం చేసేవాడు దొరకాలిగా. ఒక వేళ ఎవడైనా ఒప్పుకుంటే మాత్రం నా మనసెలా అంగీకరి స్తుంది సాబ్. నేనూ మనిషినేగా అన్నాడు ఖాసిం ఉద్రేకంగా. స్తబ్దంగా వుండిపోయేరు మాష్టారు.

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా కంటికి నిద్రన్నదే రాలేదు. పెళ్ళికి ఎదిగిగుండెల మీద కుంపటిలా వున్న శారద. ఇంజనీరింగ్ మధ్యలో ఆపి చిన్న పనిలో చేరుతాననే కొడుకు త్రిగుణ్‌ల భవిష్యత్తే కళ్ళలో మెదలుతోంది. కంపెనీవాళ్ళు ఇచ్చే మూడు వందలు, ప్రయివేట్లు చెప్పగా వచ్చే రెండు వందలు, మొత్తం కలిపి అప్పులు లేకుండగా, ఇంట్లో వున్న విలువైన సామాన్ల అమ్మకంతో నెలలు గడుస్తున్నాయి. కానీ ఇలా ఎంతకాలమో నడవదని తెలుసు. త్రిగుణ్ చదువు మధ్యలో ఆపితే ఇంతవరకూ చేసిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరవుతుంది. భవిష్యత్‌కోసం కలలుకంటున్న ఆ యువకరక్తం ఇప్పుడే చల్లారిపోతుంది. చంద్రం శారద ఒకరినొకరు ఇష్టపడుతున్నారని తెలుసు. చంద్రా నికి తండ్రంటే ఎంత భయమో కూడా తెలుసు. చంద్రం అంతస్తుకు తాము సరితూగ లేమని తెలిశాక కూడా చంద్రం ఇంకా శారదను చేసుకుంటాడనుకోవ డం అత్యాశే అవుతుంది. చంద్రాన్ని కాదని తక్కువలో ఏదైనా సంబంధం చూద్దామన్నా పదిహేనుకు పైనే కాని క్రిందిలో ఎవరూ లేరు.

పరిపరివిధాల ఆలోచనలతో ఆ రాత్రి కంటిపై కునుకనేదే రాలేదు. పట్టిన ఐదు నిమిషాలలోనూ ఒక

చక్కని కల. కొడుకు చదువు పూర్తిచేసి మంచి రేంక్‌లో వున్నట్టు, శారద— చంద్రాన్ని పెళ్ళాడి అత్తారింట్లో వున్నట్టు, పుష్పించని మొక్క, ఫలించని ప్రేమ, సిద్ధించని ఆశయం, యదార్థంకాని కల— యివి ఆశాజ్యోతిని ఆరకుండా చూస్తాయని ఒక ప్రముఖ రచయిత వ్రాశాడు. మేలుకున్న మాష్టారి మనసు చేసింది ఒకటే నిశ్చయం. ఖాసిం ఒప్పుకోడు. అయినా అతడ్ని ఒప్పించాలి.

కటకటాలకు తాళం తీస్తున్నచప్పుడుకు జ్ఞాపకాల వలయం నుండి తల పైకెత్తేరు రామారావు మాష్టారు.

జగదాంబగారు క్యారియర్‌తో నిలబడి వున్నారు. ఆవిడను చూస్తే చాలారోజులుగా బెంగతో తిండి తింటున్నట్టుగా లేదు. జగదాంబగారికి యాభై సంవత్సరాల వయసు వుంటుంది. రెండు చెంపలూ నెరసి పెద్ద తనాన్ని సూచిస్తున్నాయి.

"లేచి ఎంగిలి పడండి" అంటూ క్యారియర్ విప్పేరు జగదాంబగారు.

కలిసితిందాం అన్నట్టు సైగ చేసేరు మాష్టారు. ఆవిడకెందుకో బాధ కలిగింది. దుఃఖం కట్టలు త్రెంచుకొని ఒక్కసారే ప్రవహించినట్టయ్యింది. బడ బడ శబ్దం రాకపోయినా సన్నగా ఏడ్చేసిందావిడ.

జాలిగా తల నిమిరేరు మాష్టారు. ఆలోచనా ధోరణిలో పడి తనకు తెలియడం లేదు కానీ, బయటంతా వర్షంగా వుంది. ఆవిడ వళ్ళూ, తల తడిసినట్టుగా వున్నాయి.

ఫోర్‌వాట్‌టూవచ్చి "ఏమైనా కావాలాఅమ్మా" అని అడిగాడు. వద్దని చెప్పిందావిడ. విప్లవకారుడ్ని చూడ్డానికి అతని స్నేహితులు వచ్చారు.

జగదాంబగారు నెమ్మదిగా చెప్పింది. "రేపు కోర్టులో తీర్పు చెపుతారట. స్వల్పమైన శిక్షే పడుతుందట. అది కూడా పడకుండా వుండాలని చంద్రం ప్రయత్నిస్తున్నాడు. గవర్నమెంటు డాక్టర్ మీకిచ్చే సర్టిఫికేటును బట్టి వుంటుందని ప్రాసిక్యూటర్‌గారు చెప్పేరని చంద్రం అన్నాడు" అని చెప్పి మౌనం వహించిందామె. మాష్టారు ఏ విధమైన వికారాలూ ప్రదర్శించలేదు. "కానివ్వండి" అన్నారు. మరి మట్లాడలేదు.

మూలగావున్న పక్కబట్టలు పరచి, విచారంగా చూస్తూ వెళ్ళిపోయారు జగదాంబగారు.

* * *

హోటల్ అశోకవర్ధన్ ముందు ఆటో దిగి చూస్తే, ఆ హోటలే కాదు, రోజూ చూసే ఆ ప్రదేశమే కొత్తగా కనిపించింది. సాయంత్రం ఐదున్నర అవుతోంది. ట్రాఫిక్ విపరీతంగా వుంది. 'వన్ వే' ట్రాఫిక్ వల్ల ఎదురు వాహనాల బెడదలేదు. హోటల్ అశోకవర్ధన్ ఆ సెంటర్‌లోని గొప్పవారి విలాస కేంద్రం. హోటల్ ఎదురుగా విశాలమైన రోడ్డు.

***రోడ్డుకు ఆవలివైపున కొద్ది దూరంలో గవర్నమెంటు ఆఫీసు తాలూకు ఎత్తైన వ్యవహారిగోడలు హోటల్ ఆఖరి అంతస్తు బాల్కనీలో నిలబడి చూ***స్తున్నారు సుమారు 20 మంది ప్రేక్షకులు.

*ఖాసిం పరుగెత్తుకువచ్చాడు. చేతులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు. 'వద్దుసాబ్ ట్రాఫిక్‌ను చూస్తుంటే భయంగా ఉంది. నేనీపని చేయలేను' అన్నాడు. 'నా పరిస్థితి ఇంతకుముందే చెప్పి ఒప్పించాను. నేను పోవడం ఎలానూ తప్పదు. అదేదో ఇలా పోనీ ఖాసిం' అన్నారు మేష్టారు.*

*ఖాసింను మళ్లీ ఒప్పించేసరికి సగం ప్రాణం వచ్చినట్లయ్యింది. రోడ్డును మామూలుగా క్రాస్ చేసేసరికి పది నిముషాలు పట్టేంది. ఇప్పుడు పది నిమిషాలు పట్టిన రోడ్ క్రాసింగ్, హోటల్ పై ప్రేక్షకులు సిగ్నల్ ఇవ్వగానే అరనిముషం లోపున ఎక్కడా ఆగకుండా దాటాలి.*

నెమ్మదిగా తలపైకెత్తి చూశారు రామారావు మాష్టారు. ఇప్పుడు అరబ్బులు స్పష్టంగా కనపడుతున్నారు. తలపై కప్పుకున్న తెల్లని వస్త్రం, కళ్ళలోని వింత ఆనందాన్ని కప్పరచకుండా వుండడానికే అన్నట్టుగా వున్న నల్ల కళ్ళద్దాలు. మానవుడిలోని పైశాచిక ఆనందానికి ప్రతీకలు ఆ వ్యక్తులు. వాళ్ళకి కొద్ది దూరంలో మానవత్వానికి ప్రతినిధిగా విచారంగా నిలబడివున్నాడు ఖాసిం.



పొరపాటు

"ఎప్పుడో నేను చేసిన పొరపాటుకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నానోయ్..."

"ఏమిటి నువ్వు చేసిన పొరపాటు?"

"నా పెళ్లి చూపుల్లో 'స్వీట్' బావుందన అనబోయి 'అమ్మాయి' బావుందని పొరపాటున అనడం".

మహర్షి (కొత్తగూడెం)

రామారావు మాష్టారికి, ఆనందం, విచారం రెండూకలిగాయి. తనతో ఏ బంధనాలూ లేకపోయినా, తను చస్తున్నానంటే బ్రతికుండగానే విచారం ప్రకటిస్తున్నాడు ఒక వ్యక్తి.

విచారిస్తున్నదీ ఒక్కందుకే. ఈ దేశపు సగటు పౌరుని ఆర్థిక పరిస్థితి మీద, ఇప్పటికీ పై దేశంవాడు చూపిస్తున్న చులకన భావం గురించే.

ఒక అరబ్ తన చేతిలోని రుమాలును గాలిలో వూపాడు. వాడి చేతిలోని రుమాలు క్రిందికి వదలగానే, వెనుక ముందులు చూడకుండా పరుగెత్తాలి. మధ్యలో ఆగినా, భయపడి వెనక్కి వచ్చినా వ్రతం చెడినట్టే. అప్రయత్నంగా దేముడిని స్మరించేరు మాష్టారు. చిరుచెమట ప్రారంభం అయ్యింది. గుండె వేగం హెచ్చింది. చావు ధైర్యం అంటే స్పష్టంగా తెలుస్తోంది. చావుకేక అంటే ఎలా వుంటుందో వినాలని పై వాళ్ళంతా ఆరాట పడుతున్నారు.

బాల్కనీ అంచున వున్న అరబ్‌లంతా చేతులు ముందుకు సాచి "రెడీగా వున్నావా" అన్నట్లు బొటన వ్రేళ్ళు చూపించారు. ప్రతి సంజ్ఞ అందడంతోనే చేతిలోనున్న రుమాలుకి స్వేచ్ఛ ప్రసాదించబడింది.

ఎవరో దగ్గరకు వస్తున్న చప్పుడుకు జ్ఞాపకాల వలయం నుండి తల పైకెత్తేరు రామారావు మాష్టారు. ఫోర్‌వాట్‌టూ చేతిలో ఏదో పట్టుకొని వస్తూ కనిపించేడు.

"మాష్టారూ! బయట వర్షం ఎక్కువగా వుంది. రాత్రి బాగా చలి వేయవచ్చు. మీరు తట్టుకోలేరు. ఈ రగ్గు కప్పుకోండి" అంటూ నమ్రతగా తన నల్లరగ్గు ఇచ్చాడు.

"మరి మీకు" అన్నట్టు చూశారు మాష్టారు.

"నేను డ్యూటీ దిగిపోతున్నాను సార్, మళ్ళీ రేపే వస్తాను. మిమ్మల్ని కోర్టుకు తీసుకువెళ్ళడానికి. రేపటిది ఆఖరి హియరింగ్ అవుతుందనుకుంటానుసార్. మీకు శిక్ష పడకుండా వుండాలని దేవుడిని కోరుకుంటున్నాను సార్" అన్నాడు ఫోర్‌వాట్‌టూ గొంతు బొంగురు పోగా.

ఖాకీ బట్టల్లో అరుదుగా కనిపించే ఆ వ్యక్తిత్వానికి ఒక్కక్షణం చలించారు మాష్టారు. "స్వాతంత్ర్యం వచ్చి మూడు దశాబ్దాలకు పై దాటుతున్నా ఈ దేశంలో ఆకలి మంటలు, నిరుద్యోగ సమస్య విచ్చలవిడిగా విశృంఖలంగా పెరుగుతూ నిలయతాండవం చెయ్యడానికి కారణం, నీ వంటి వోరు మెదపని మూగ వెధవలు ఎక్కువగా వుండటమే" అన్నట్టు కోపంగా చూస్తున్నాడు విప్లవకారుడు.

మగతగా కళ్ళుమూశారు మాష్టారు. గత స్మృతుల ఆలోచనారణ్యం కళ్ళు తెరచింది.

* * *

రోడ్డుపై వాహనాలు చేసే హారన్ చప్పుళ్ళు శివుని శంఖారావాల్లా వినబడుతున్నాయి. డకోటా బస్సులు చేసే వింత ధ్వనులు శివసాన్నిధ్యంలో వినిపించే ఢమరుక ధ్వనుల్లా వినబడుతున్నాయి. ఆటోలు, ఆర్.టి.సి. బస్సులు భూతలయమవాహనాల్లా వేగంగా వెళ్ళిపోతున్నాయి. మరణానికి తెగించిన వీర సైనికుల్లా బస్సుల వూచల్ని పట్టుకొని వ్రేలాడుతున్నారు ఇళ్ళకు పోయే జనం. తనను బలి తీసుకునే 'మృత్యు వాహనం' దగ్గరకు వచ్చే వుంటుందన్న తలంపురాగానే భార్యా, బిడ్డలు కళ్ళలో మెదిలారు. పిల్లల భవిష్యత్ గుర్తుకు రాగానే కుడికాలు ముందుకు వేసేరు. చిన్నతనంలో చేసిన పరుగుపందెం గుర్తుకొచ్చింది. మనసు అదుపు తప్పి క్షణానికి ఒక ఆలోచన చేస్తోంది. శరీరమంతటా సన్నని వణుకు ప్రారంభం అయ్యింది. బాల్కనీలోని షేక్‌లు చప్పట్లు కొడుతూ అరబ్బీ భాషలో అరుస్తున్నారు. బహుశా గుర్రప్పందాల ఆటలో ఆటగాళ్ళు

వలికే పలుకయి వుంటుంది.

చెమటకు తడిసిన చొక్కా వంటికి అతుక్కుపోయింది. చేతులు వూపడంతో భుజం మీద చిరుగు మరింత పెద్దదిగా అవుతోంది. ఒక బస్సు రాసుకుంటూ పోయింది. డ్రైవర్ ముఖంకేసి చూడలేదు కాబట్టి అతని ముఖం ఎంత వికారంగా పెట్టి వుంటాడన్నది తెలియలేదు. ఆటోవాడు డాష్ ఇచ్చేవాడేకానీ, ముఖం మీది నుండి రాచుకుంటూ వెళ్ళిపోయాడు. శవానికి ముందు వెళ్ళే భజంత్రీ చప్పుడులాగ రోద చేసుకుంటూ ఒక బుల్లెట్ బండి దూసుకు పోయింది. వేసింది పది అడుగులైనా లేకపోయినా ఆయాసంతో రొప్పుతున్నారు రామారావు మాష్టారు. దూసుకు పోతున్న వాహనాలు చేసే శబ్దానికి వెన్నులో నుండి వణి పుడుతోంది.

స్పర్శజ్ఞానం తగిలేసరికి ఆలోచనా ప్రపంచానికి అంతరాయం కలిగింది. అర్ధ నిమేత్రంగా వున్న కళ్ళను తెరచి చూశారు రామారావు మాష్టారు. విప్లవకారుడు నల్లరగ్గును తనవంటిపై కప్పుతున్నాడు. బయట చలి గాలి, వర్షం ఉధృతంగా వున్నాయి. తను సన్నగా వణుకుతున్నాడు. అందుకే విప్లవకారుడు రగ్గు కప్పుతున్నాడులా వుంది.

విప్లవకారుడు జాలిగా చూశాడు. చిన్నగా నవ్వేరు మాష్టారు. పుట్టుకతోనే ఎవ్వరూ దొంగలూ కారు, దుర్మార్గులూ కారు, విప్లవకారులూ కారు. పరిస్థితుల ప్రభావానికి మారుతూ వుంటారు అనిపించింది.

మెమ్మదిగా యధాస్థితికి వెళ్ళిపోయారుమాష్టారు. గత స్మృతి సుడిగుండంలా తిప్పుతోంది.

* * *

వెన్నులో నుండి పుడుతున్న వణికి పరుగులో వేగం తగ్గిపోయింది. రెండు కాళ్ళూ నీరసంతో కొట్టుకుంటున్నాయి. ప్రాణభీతికి కుడిచెయ్యి అప్రయత్నంగా పైకి లేచి వేగంగా వస్తున్న వాహనాలను ఆగమన్నట్టు చెపుతోంది. కాళ్ళలో పుట్టిన వణుకు ఆగిపొమ్మని అపుతుంటే, కర్తవ్యం కార్యనిర్వహణను గుర్తుచేసి ముందుకు నెంటుతోంది. క్షణం, క్షణం మనసు తన నిర్ణయాన్ని మార్చుకుంటోంది. అయినా కాళ్ళు ముందుకే అడుగు వేస్తున్నాయి.

రోడ్డు నడిమధ్య కొచ్చేరు మాష్టారు. ఇంకా సగం వుంది. అడుగులు తడబడుతున్నాయి. వణుకుతున్న రెండు కాళ్ళు ఒకదానికొకటి తగిలాయి. నిస్త్రాణతో వున్న శరీరం అదుపు తప్పి వేగంగా వస్తున్న సైకిలుపై తూలిపోయింది.

ఈ హఠాత్ చర్యకు గమనిస్తున్న సైకిలు కుర్రాడు అదిరిపడి, రెండు బ్రేకులూ వక్కసారి వేసి, ఫ్రంట్ వీలర్ పై వాలిపోతున్న మాష్టారిని నిలబెట్టాలని ప్రయత్నించే కృషిలో ముందుకు వంగి ఆయన్ని రెండు చేతుల్లో పైకి లేపాడు. తత్ ఫలితం బాలెన్స్ తప్పి వెల్లకిలా పడ్డాడు. వెనకే వస్తున్న మరో భూతల యమ దూతలుగా కీర్తించబడే ప్రభుత్వ డాక్టర్ల వాహనం 'అంబులెన్స్' ఎర్రటి ఆ యువక రక్తాన్ని టైర్లకు పారాణిలా పూసుకుంటూ ఆ యువకుడి నడుం మీద నుండి వెళ్ళిపోయింది.

వాతావరణం గగ్గోలెత్తిపోయింది. ట్రాఫిక్ అంతా క్షణంలో 'కీచు'మనే శబ్దం చేసి ఆగిపోయింది.

'అమ్మా' అన్న ఆ యువకుడి ఆర్తనాదం జగదాంబగారి కర్ణపుటాలకు సోకివుంటే ఆవిడ గుండె అప్పడే ఆగిపోయేది.

ప్రకృతి ఒక్కసారి స్తంభించినట్టయింది. చుట్టూ జనం మూగిపోయారు. అరబ్ షేక్‌లు ఆనందంతో షేక్‌హేండ్‌లిచ్చుకుంటున్నారు. రామారావు మాష్టారు రెప్పవేయకుండా, ఉన్నచోటు నుండి కదలకుండా రక్తపు మడుగులో గిలగిలలాడుతున్న యువకుడిని చూస్తున్నారు. గుండె కొద్దిక్షణాలు కొట్టుకోవడం మాని తిరిగి పని ప్రారంభించింది.

జనం రెచ్చిపోతున్నారు. ఎద్దులావుండి రోడ్డుకు అడ్డంగా పరుగెత్తేడు. వెధవని చావతన్నండి పట్టుకొని అంటున్నారు. అరబ్ షేక్‌ల మాదిరేవున్న అంబులెన్స్



**సహజ సౌందర్యం**

సినీ నటి సుందరిని అడిగాడు విలేఖరి.

''పముఖ వ్యక్తితో మీ పెళ్లి చివరి క్షణంలో కాన్సిల్ కావడానికి కారణం...?''

''పొరపాటున నన్ను మేకప్ లేకుండా ఆయన చూడడమే...'' బాధగా చెప్పింది సుందరి.

మహర్షి(కొత్తగూడెం)

లోని మనుషులు స్ట్రెచ్చర్ తీసుకు వచ్చేరు.

తన భావి భారత భవిష్యత్ ఇంజనీర్ కేసి కన్నార్పకుండా తనివితీరా కడసారి చూపుల్లా చూసుకుంటున్నారు రామారావు మాష్టారు.

''అన్నీ తెలిసినవారై ట్రాఫిక్ రూల్సుకు వ్యతిరేకంగా ఎందుకు నడిచేరు. దానివల్ల ఒక నిండు జీవితం బలైంది. ఆఫ్‌కోర్స్, అది మీ అబ్బాయే కావచ్చు. ఆ వ్యక్తి మరెవరైనా దానికి బాధ్యులు మీరే కదా'' అన్న జడ్జీగారి ప్రశ్నకు.

''బతుకు మీద విరక్తివేంది'' అన్నాడు తను.

ఆత్మహత్యా ప్రయత్నం కూడా నేరమే కాబట్టి శిక్ష జోరుగా పడవచ్చును. పిచ్చివాడివని సర్టిఫై చేయించి బయట పడెయ్యాలని చూస్తున్నాడట చంద్రం. ఎంత విచిత్రం. అయినా ట్రాఫిక్ రూల్సుకు వ్యతిరేకంగా నడవడం వలన తనకే కాక పైవారికి కూడా ప్రాణహాని వుంటుందని తను ముందుగానే ఎందుకు వూహించలేక పోయాడు. ఇది నిశ్చయంగా తొందరపాటు చర్యే.

ఆ రోజు ప్రభుత్వం తీసుకున్న హఠాత్ నిర్ణయాన్ని తొందరపాటు చర్యగా విమర్శిస్తున్న స్నేహితుల వాదాన్ని తానొక్కడే ఆ రోజు ఖండించాడు. పొరపాటు అనేది విధాతకే సహజం, అటువంటిది ప్రభుత్వం ఎంత అన్నాడు. జరిగింది పొరపాటనే నిర్ణయించుకొంటే దాన్ని సవరించుకొనే అవకాశం ముందువుంది, అంటూ ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చేడు తను. అటువంటిదే ఒక చర్య ఈరోజు తమూ చేశాడు. తను తీసుకున్న నిర్ణయం పొరపాటని తెలిసి ఇప్పుడు సరిదిద్దుకోవాలనుకొంటున్నాడు. కానీ!

అందుకు మృత్యువు అంగీకరించి, ఒక చర్యకు గాను, ప్రతిచర్యగా తాను తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకొని తన వెంట తీసుకువెళ్ళిన జీవితాన్ని వాపసు ఇవ్వమంటే ఇస్తుందా?

అసలు సృష్టిలో మనిషికి ఒక్కడికే 'బుద్ధిని', 'హృదయాన్ని' ఇవ్వడంలో భగవంతుడే తొందర పడ్డాడేమో.

భవిష్యత్‌లో మరెప్పుడూ ఎవరూ తొందర పాటు చర్యలకు గురికాకుండాచూడమని భగవంతుడిని మనసారా ప్రార్థించేరు రామారావు మాష్టారు.

స్టేషన్ గడియారం ఉదయం తొమ్మిది కొట్టింది. బయట గాలివాన వెలిసి ప్రశాంతంగా వుంది. అప్పడే వచ్చిన ఫోర్‌నాట్‌టూని పిలిచి మాష్టారిని లేపమన్నాడు స్టేషన్ హెడ్. హెడ్ మాటలకు ఆశ్చర్యపోయిన ఫోర్‌నాట్‌టూ ''మాష్టారింకా నిద్ర లేవక పోవడమేమిటి. బహుశా రాత్రి చలికి నిద్రపట్టి వుండదు. ఏ తెల్లవారు ఝామునో నిద్రపట్టి ఉంటుంది'' అనుకుంటూ తలుపు తెరిచాడు.

విప్లవకారుడు నిర్లిప్తతతో మాష్టారివంకే చూస్తున్నాడు.

మెడవరకూ నల్లరగ్గు కప్పుకొని దీర్ఘనిద్రలో వున్నట్టున్న మాష్టారు అంపశయ్యపై పడుకున్న భీష్ముడిలా కనిపిస్తున్నారు. అనుమానంగా వెళ్ళి వంటిపై చెయ్యి వేశాడు ఫోర్‌నాట్‌టూ. ఐస్ కన్నా చల్లగా తగిలేరు మాష్టారు.

ఫోర్‌నాట్‌టూ చర్యను గమనిస్తూ కటకటాల వెనకే ఆగిపోయాడు అప్పడే వచ్చిన చంద్రం. కళ్ళెదురుగా అంత బీభత్సం జరిగినా ఆ ముసలిప్రాణం ఇంకా నిలిచి వుందంటే, అది శారద వివాహాన్ని చూడడానికే అనుకున్నాడు తను. కాంతి విహీనంగా నేలరాలింది చంద్రం తండ్రి వ్రాయించిన శారద చంద్రంల వివాహ నిశ్చితార్థ పత్రిక.

ఏ కోర్టులూ వెయ్యలేని శిక్ష అంతఃక్షోభ. అది అనుభవించడానికేనా ఇన్ని రోజులూ వుండి వెళ్ళిపోయారా మాష్టారూ, అనుకొంటూ రెండు కన్నీటి బొట్లు విడిచాడు ఫోర్‌నాట్‌టూ.

క్రమం తప్పకుండా ఏ పండక్కి ఆ పాటలే వినిపించే ఆలిండియా రేడియోవారు భీష్మ ఏకాదశి పాటలు వినిపిస్తున్నారు. ●